ప్రయోగాలు లేక తగ్గుతున్న నైపుణ్యం

- బిచ్కుంద డిగ్రీ కళాశాల ల్యాబ్‌లో సౌకర్యాలు కరువు
- నాలుగేళ్లుగా ల్యాబ్‌లో లేని కెమికల్స్
- ప్రారంభమైన ప్రాక్టికల్స్
- నిధులు లేవంటున్న ప్రిన్సిపాల్



ప్రాక్టికల్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు



కెమికల్స్ లేక ఖాళీగా ఉన్న పాత్రలు

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్ (స్వయం ప్రతిపత్తి) పొందినప్పటికీ విద్యార్థులకు ప్రాక్టికల్ కోసం ల్యాబ్‌లో ఎలాంటి సౌకర్యాలు లేవు. ప్రాక్టికల్స్‌కు హాజరయ్యే విద్యార్థులు సిలబస్‌లోని ప్రతి అంశంపై రోజూ ప్రయోగాలు చేయాల్సి ఉంటుంది. కెమికల్స్ ఇతర మెటీరియల్ వసతులు లేక ప్రయోగాలకు దూరంగా ఉంటున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ల్యాబ్ నిర్వహణ కోసం నాలుగేళ్లుగా ప్రభుత్వం నిధులు కేటాయించడం లేదు. నిధుల కొరతతో రసాయనాలు అందుబాటులో లేక ప్రాక్టికల్ సౌకర్యాలకు ఆటంకం కలుగుతోంది. అటానమస్‌తో పాటు న్యాక్‌లో ఏ గ్రేడ్ సాధించిన కాలేజీలో సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. బుధవారం నుంచి కళాశాలలో బీజెడ్‌సీ ఫైనల్ ఇయర్ చదువుతున్న 81 మంది విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులకు త్వరలో ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. డిగ్రీ కళాశాలలో మొత్తం 1151 మంది విద్యార్థులు ఆయా కోర్సులలో చదువుకుంటున్నారు. ల్యాబ్‌లో కూర్చుండి నోట్‌బుక్‌లో రాసుకోవడం తప్ప ప్రాక్టికల్ అవగాహన పొందక విద్యా ప్రమాణాలు తగ్గుతాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

నిధులు కేటాయించాలి

విద్యార్థులు కేవలం సిలబస్ ద్వారా నైపుణ్యాన్ని పెంపొందించుకోలేరు. థియోరీ తప్ప ప్రాక్టికల్స్‌గా జ్ఞానాన్ని పెంచుకోలేక, ఇతరులతో పోటీ పడలేకపోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఐడీ కార్డులు ఇవ్వడంతో పాటు ల్యాబ్ నిర్వహణకు నిధులు కేటాయించాలని విద్యార్థులు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

జేడీ దృష్టికి తీసుకెళ్లాం

ల్యాబ్‌లో ప్రయోగాల కోసం కెమికల్స్ లేవు. నిధులు కేటాయించాలని హైదరాబాద్‌లోని జేడీ కార్యాలయంలో అధికారులకు కోరాం. ఇప్పటి వరకు నిధులు రాలేదు. వచ్చే ఏడాది వరకు ల్యాబ్‌లో ప్రయోగాల కోసం అన్ని వసతులు కల్పిస్తాం.

– అశోక్, ప్రిన్సిపాల్, డిగ్రీ కళాశాల బిచ్కుంద

దివ్యాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



బాన్సువాడలో మాట్లాడుతున్న అడివయ్య

బాన్సువాడ : అసెంబ్లీ ఎన్నికల్లో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య అన్నారు. బుధవారం బాన్సువాడలో దివ్యాంగుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు అంత్యోదయ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసంలో 5 శాతం దివ్యాంగులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల సమస్యలపై ఈ నెల 26న బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం నాయకులు గంగాధర్, గొల్ల గంగాధర్‌యాదవ్, గంగారం, సంగ్రామ్, సంగప్ప, కృష్ణ, వినోద్, బిక్షపతి, కాశీరాం, గంగసాయిలు తదితరులున్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి



అంచనూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ సంజయ్‌రావు



గాంధారిలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విండో చైర్మన్ సాయికుమార్

దోమకొండ/బీబీపేట/భిక్కనూరు : రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధరను పొందాలని తహసీల్దార్ సంజయ్‌రావు అన్నారు. మండలంలోని అంచనూరు, లింగుపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో బుధవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. బీబీపేట మండలం ఉప్పర్‌పల్లి, కోనాపూర్, మల్కాపూర్, ఇస్సానగర్ గ్రామాల్లో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. భిక్కనూరు మండలం మల్లుపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఐకేపీ డీపీఎం రమేశ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

గాంధారి(ఎల్లారెడ్డి) : రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో చైర్మన్ సాయికుమార్, ఏఎంసీ చైర్మన్ పరమేశ్వర్ అన్నారు. స్థానిక ఏఎంసీ యార్డులో బుధవారం జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులు పండించి పంటలను దళారులకు విక్రయించి నష్టపోవద్దని సూచించారు. కార్యక్రమంలో సింగిల్ విండో, ఏఎంసీ వైస్ చైర్మన్లు ఉద్దల్‌సింగ్, ఆకుల లక్ష్మణ్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

ప్రమాదాలపై అవగాహన



బాన్సువాడ/ఎల్లారెడ్డిరూరల్ : అగ్ని ప్రమాదాలపై బుధవారం బాన్సువాడ, ఎల్లారెడ్డి ఆస్పత్రుల్లో అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆస్పత్రిలో అత్యవసర పరిస్థితిల్లో ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మంటలను నియంత్రించే విధానంపై అవగాహన కల్పించారు. ఫైర్ ఆఫీసర్లు వినోద్, మదన్, జందార్ సలీం, ఫైర్ మెన్ వినోద్, సిబ్బంది జ్యోతిరాజ్, హరిసింగ్ తదితరులున్నారు.

కృత్రిమమేధతో పాఠ్యాంశాల బోధన

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కృత్రిమమేధ (ఏఐ)తో విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. ప్రాథమిక దశలో 1వ తరగతి నంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు కంప్యూటర్ ద్వారా కోడింగ్, డికోడింగ్, గణితం, ఇంగ్లీష్ తదితర విషయాలను ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. మండలంలో కేవలం బోర్లం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మాత్రమే కృత్రిమ మేధ బోధనకు ఎంపికైందని ఉపాధ్యాయులు అయ్యాల సంతోష్ పేర్కొన్నారు.

హుండీ డబ్బులను కాపాడాలని ఆర్డీవోకు వినతి



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ముందు ప్రభుత్వ స్థలంలో కట్టిన లక్ష్మి గణపతి ఆలయంలో హుండీ డబ్బులను కాపాడాలని భక్తులు, స్థానిక కాలనీవాసులు బుధవారం ఆర్డీవోవాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ ఆలయం వెనక షాపు నిర్వహిస్తున్న మహిళ ఈ ఆలయం తమదే అని.. తన భర్తే కట్టించాడని భక్తులను దబాయిస్తోందని తెలిపారు. హుండీలో, హారతి పళ్లెంలో వేసే డబ్బులు ఆమెనే తీసుకుంటుందని ఫిర్యాదు చేశారు. ఆలయంలో పూజారిని కూడా వేధిస్తున్నారన్నారని చెప్పారు. ఎవరైనా ప్రశ్నిస్తే మహిళకు సంబంధించిన కుటుంబ సభ్యులు తమపై దుర్భాషలాడుతున్నారని వాపోయారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను కోరారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



గాంధారిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

గాంధారి/తాడ్వాయి(ఎల్లారెడ్డి): వరంగల్‌లోని ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. గాంధారి మండలకేంద్రంలోని షాదీఖానాలో, తాడ్వాయిలో నిర్వహించిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తల సన్నాహాక సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామం నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వరంగల్‌కు తరలి రావాలన్నారు. గాంధారి బస్టాండ్ సమీపంలో గోడపై వరంగల్ రజతోత్సవ కార్యక్రమాల వివరాలను రాశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సభ పోస్టర్ల ఆవిష్కరణ

దోమకొండ: వరంగల్‌లోని ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగ్ర మధుసూదన్‌రావ్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని పెరికసంఘంలో పార్టీ మండల ముఖ్యనాయకులు సమావేశం నిర్వహించారు. అనంతరం చలో వరంగల్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుంచాల శేఖర్, ముత్యంపేట సింగిల్ విండో అధ్యక్షుడు తిరుపతిగౌడ్, మాజీ అధ్యక్షుడు రమణారెడ్డి, బీబీపేట సింగిల్‌విండో ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బొమ్మెర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలలో 'పోషణ్ పక్వాడా'



జలాల్‌పూర్‌లో గర్భిణులకు సామూహిక సీమంతాలు చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఆత్మకూర్, జలాల్‌పూర్ గ్రామాలలో గల అంగన్‌వాడీకేంద్రాలలో బుధవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరీబాయి ఆధ్వర్యంలో 'పోషణ్ పక్వాడా' కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు బరువుతీసి తల్లులకు అవగాహన కల్పించారు. దీంతో పాటు చిన్నారులచేత సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. మండలంలోని జలాల్‌పూర్ అంగన్‌వాడీకేంద్రంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు సావిత్రి, భూదేవి, మనోరంజని, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలలో అన్నప్రాసన

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి అంగన్‌వాడీ సెక్టార్‌లో బుధవారం అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని రిక్షా కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ హారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మ, లలిత, నీలారాణి తదితరులున్నారు.

మోడల్‌హౌస్ నిర్మాణ పనుల అప్పగింత



మోడల్‌హౌస్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న హౌసింగ్ డీఈఈ సుభాష్, ఏఈ అశోక్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో అర్ధాంతరంగా నిలిచిన ఇందిరమ్మ మోడల్‌హౌస్ నిర్మాణ పనులను బుధవారం హౌసింగ్ అధికారులు స్థానిక కాంట్రాక్టర్‌కు అప్పగించారు. మండలంలో ఇందిరమ్మ మోడల్‌హౌస్ నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిన విషయమై ఈ నెల 15న 'గుంతలకే పరిమితమైన ఇందిరమ్మ మోడల్‌హౌస్'అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి హౌసింగ్ అధికారులు స్పందించారు. ఈ మేరకు హౌసింగ్ డీఈఈ సుభాష్, ఏఈ అశోక్ మండల పరిషత్ కార్యాలయానికి వచ్చి స్థానిక ఎంపీడీవో ప్రభాకరచారితో చర్చించారు. మండలంలోని రామక్కపల్లికి చెందిన రవీందర్‌రెడ్డి అనే వ్యక్తికి ఇందిరమ్మ మోడల్‌హౌస్ నిర్మాణ పనులను అప్పగించారు. పనులను నాణ్యతతో చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలని వారు సూచించారు.

సాక్షి ఎఫెక్ట్..

రోడ్డు పక్కన ముళ్ల చెట్ల తొలగింపు



ముళ్ల చెట్లను తొలగిస్తున్న అధికారులు

బిచ్కుంద(జుక్కల్): బిచ్కుంద- కందర్‌పల్లి రోడ్డు పక్కన ఉన్న ముళ్ల చెట్లను బుధవారం ఆర్‌అండ్‌బీ అధికారులు జేసీబీతో తొలగించారు. బుధవారం ప్రమాదకరంగా ముళ్ల పొదలు అనే శీర్షికన బుధవారం ప్రచురితమైన కథనానికి ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న ముళ్ల చెట్లను తొలగించి శుభ్రం చేశారు. చెట్లను తొలగించాలని గత రెండు మూడేళ్ల నుంచి ఎన్నో సార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందించలేదని వాహనదారులు తెలిపారు. బిచ్కుంద నుంచి కందర్‌పల్లి మూడు కిలో మీటర్లు జేసీబీతో చెట్లు తొలగించి రోడ్డు శుభ్రం చేశారు. ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేసి 'సాక్షి'కి ధన్యవాదాలు తెలిపారు.

ఆధ్యాత్మికం

ఘనంగా సిద్ధిబుద్ధి వినాయక కల్యాణం



దోమకొండ: మండల కేంద్రంలోని చాముండేశ్వరి ఆలయంలో బుధవారం సిద్ధి బుద్ధి వినాయక కల్యాణం ఘనంగా నిర్వహించారు. సంకష్ట చతుర్థి సందర్భంగా ఆలయంలో సంకష్ట గణపతి తొమ్మిదో వార్షికోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎదుర్కోలు, స్వామివారి కల్యాణం అర్చకులు వైభవంగా జరిపించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఒడిబియ్యం పోశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సిద్దారెడ్డి, డైరెక్టర్‌లు వెంకటేశం, రమేష్, ఏల్లం, బాల్‌రాజ్, ఆలయ అర్చకులు భావి కృష్ణమూర్తిశర్మ, మాజీ సర్పంచ్ నల్లవు అంజలి, మాజీ ఎంపీపీ శారద, సీడీసీ మాజీ చైర్మన్ నర్సయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ కుంచాల శేఖర్, మాజీ జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ భూముల సర్వే



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ భూములను గత కొన్ని సంవత్సరాలు రైతులు స్వాధీనం చేసుకుని పంటలు పండిస్తున్నారు. ఈ క్రమంలో అట్టి భూములు ఎవరెవకి ఆక్రమణలో ఉన్నాయనే విషయంపై బుధవారం పోలీస్ బందోబస్తు మధ్య సర్వే చేపట్టారు. సహాయ కమీషనర్ దేవాదాయ, ధర్మాదాయ శాఖ నిజామాబాద్ ఆధ్వర్యంలో భూముల సర్వే నిర్వహించారు. ఈసర్వే కార్యక్రమాన్ని మూడు రోజుల పాటు చేపట్టనున్నట్లు తెలిపారు. రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం

కామారెడ్డి అర్బన్: స్థానిక శ్రీఅయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ, అయ్యప్ప అన్నప్రసాద సేవా సమితి ప్రతినిధులు గోనే శ్రీనివాస్, పట్నం రమేష్, బాస రఘుకుమార్, పి.కిరణ్, పందిరి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి భేతాళ స్వామి జాతర



బాన్సువాడ : పట్టణంలో గురువారం నుంచి భేతాళ స్వామి జాతర నిర్వహించనున్నారు. 17న ఎడ్ల బండ్ల ప్రదర్శన, 18న కుస్తీ పోటీలు, 19న జాతర ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. తెలంగాణలో మొట్టమొదటి భేతాళుడు సంగారెడ్డి జిల్లా అల్లాదుర్గంలో ఉంటే రెండవ భేతాళ స్వామి బాన్సువాడలోనే కొలువై ఉన్నాడు. మూడు రోజుల పాటు కొనసాగే జాతరకు ఆలయ కమిటీ, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

20న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

భిక్కనూరు: మండల కేంద్రంలోని అతి పురాతనమైన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఈనెల 20న నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, పబ్బనాగరాజు, బోందుగుల నాగరాజయ్య, బోందుగుల సత్యనారాయణ, పబ్బనాగార్జున్, చీకోటి వెంకటేశంలు బుధవారం తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

ముగిసిన సీతారామ కల్యాణోత్సవాలు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి రైల్వే స్టేషన్ 64వ వార్షిక శ్రీసీతారామ కల్యాణఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈనెల 6వ తేదిన కల్యాణంతో ప్రారంభమైన ఉత్సవాలు బుధవారం శ్రీసీతారామ,లక్ష్మణ,అంజనేయస్వాములకు విశేష పూజలు, విసర్జన కార్యక్రమాలు నిర్వహించి అనంతరం నారాయణసేవ అన్నదానం చేశారు. ఉత్సవాల్లో సేవలు అందించిన ప్రతినిధులకు సన్మానం చేశారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, స్టేషన్ సూపరింటెండెంట్ వి.సత్యం, ప్రధాన కార్యదర్శి పాత రమేష్, ప్రతినిధులు, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చేపల మార్కెట్ భవన నిర్మాణానికి భూమి పూజ



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయం సమీపంలో చేపల మార్కెట్ భవన సముదాయానికి బుధవారం కాంగ్రెస్ నాయకులు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు స్థలాన్ని గుర్తించినట్లు వారు తెలిపారు. మాజీ సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రవి, మాజీ ఎంపీటీసీ బీరయ్య, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు నరేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గాలికుంటు వ్యాధి టీకాలు



దోమకొండ: మండల కేంద్రంలో బుధవారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత గాలికుంటు టీకా శిబిరం నిర్వహించినట్లు పశుసంవర్ధక శాఖ ఏడీ శ్రీనివాస్ తెలిపారు. పశువులకు ఉచితంగా టీకాలను వేసినట్లు వివరించారు. గాలికుంటు వ్యాధి నివారణ కోసం టీకాలు వేశామన్నారు. వచ్చేనెల 14వ తేదీ వరకు ప్రతి గ్రామంలో ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకా శిబిరాలు నిర్వహిస్తామన్నారు. మండల పశువైద్యాధికారి శివ, పశువైద్య సిబ్బంది రమేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆక్సిజన్ పార్క్ తనిఖీ



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండల కేంద్రంలోని ఆక్సిజన్ పార్క్‌తో పాటు పల్లె ప్రకృతి వనాన్ని బుధవారం బాన్సువాడ డీఎల్పీవో సత్యనారాయణరెడ్డి తనిఖీ చేశారు. పార్క్‌లో ఉన్న చెట్లకు నీటిని అందించి సంరక్షించాలన్నారు. ఆయన వెంట స్థానిక ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ తదితరులున్నారు.

నిబంధనలకు అనుగుణంగా ఇళ్లను నిర్మించుకోవాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు నిబంధనలకు అనుగుణంగా నిర్మించుకోవాలని హౌసింగ్ డీఈఈ సుభాష్ సూచించారు. మండలంలోని రామక్కపల్లిలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను బుధవారం ఆయన పరిశీలించారు. కొలతల ప్రకారం ఇళ్లు నిర్మించుకోవాలని ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఆయన సూచించారు. ఆయనవెంట హౌసింగ్ ఏఈ అశోక్, పంచాయతీ కార్యదర్శి వెంకట్‌రాములు తదితరులున్నారు.

గ్రామస్తుల సహకారంతో మౌలిక సౌకర్యాలు



బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం జెడ్పీహైస్కూల్‌లో పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు మౌలిక సౌకర్యాలు సమకూర్చుతున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ వెంటరమణ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు, గ్రామస్తులు అందించిన విరాళాలతో 80 ఇనుపబెంచీలు, 10 డ్యూయల్ డెస్కులు, పాఠశాల నేమ్ బోర్డు సమకూర్చారన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థుల సౌకర్యార్థం నామమాత్రపు ఫీజుతో స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసులు అందుబాటులో ఉంచుతున్నట్లు ఆయన తెలిపారు. పాఠశాల విద్యార్థులతో పాటు ఇతరులు కూడా ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మంత్రి, ఎంపీని కలిసిన కాంగ్రెస్ నాయకులు

బాన్సువాడ రూరల్: బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం హైదరాబాద్‌లో జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్‌షెట్కార్, రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో సమకాలిన రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ పథకాల అమలు, ప్రజా సమస్యలపై చర్చించారు. నాయకులు సోమశేఖర్‌రావు, మైలారాం భాస్కర్‌రెడ్డి, కమ్మ సత్యనారాయణ, ప్రతాప్ సింగ్ తదితరులున్నారు.

సంక్షిప్తం

సన్న బియ్యం లబ్ధిదారు ఇంట్లో భోజనం..



భిక్కనూరు: ప్రతి నిరుపేద కుటుంబం సంతోషంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి చెప్పారు. బుధవారం మండలంలోని మల్లుపల్లి తండా గ్రామంలో నిరుపేద ఇంట్లో సన్న బియ్యం భోజనం చేశారు. కార్యక్రమంలో తాసిల్దార్ శివప్రసాద్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎన్ఆర్ఐ సెల్ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్ పలువురు నాయకులు ఉన్నారు.

మొక్కలను సంరక్షించాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల మొక్కలను వన మహోత్సవం నాటికి సంరక్షించాలని ఎంపీడీవో నరేష్ సూచించారు. బుధవారం ఆయన మండలంలోని ఎల్లమ్మతండా, మోతె గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించారు. ఎండలు తీవ్రంగా ఉన్న ప్రతి రోజు నీటిని పట్టాలని సూచించారు. ఆయన వెంట కార్యదర్శులు ఉన్నారు.

మొక్కలు ఎండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ఎల్లారెడ్డిరూరల్: నర్సరీలలో మొక్కలు ఎండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో ప్రకాష్ అన్నారు. బుధవారం గ్రామంలో నర్సరీ, కంపోస్టుషెడ్, శ్మశాన వాటిక, ప్రకృతి వనంను ఆయన పరిశీలించారు. చెత్త సేకరణ ద్వారా కంపోస్టు ఎరువులను తయారు చేయాలని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

ఉపాధి కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల పంపిణీ

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్‌శివారులో కందకాల తవ్వకం పనులు చేపడుతున్న ఉపాధి కూలీలకు ఎంపీడీవో శ్రీనివాస్ ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందజేశారు. ఎండదెబ్బ తగలకుండా పని ప్రదేశంలో తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఈజీఎస్ సిబ్బందిని ఆదేశించారు.

డైట్ కాలేజీ విద్యార్థుల సర్వే

రామారెడ్డి: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, యాజమాన్యాలకు సంబంధించిన సమాచారాన్ని సంబంధిత హెచ్ఎంలు యూడైస్ ప్లస్‌లో నమోదు చేశారు. బుధవారం రామారెడ్డి మండలం వివిధ పాఠశాలలో యూడైస్ ప్లస్ లో నమోదు చేసిన విద్యార్థుల, ఉపాధ్యాయుల సంఖ్య, ఖాళీ పోస్టుల వివరాలు, మౌలిక వసతుల వివరాలు యూడైస్ ప్లేస్‌కి ప్రస్తుతం పాఠశాలలో సరిగా ఉన్నాయా లేదా అని నిజామాబాద్ డైట్ కాలేజీ విద్యార్థులు సర్వేను నిర్వహిస్తున్నారు. ఈవిద్యార్థులకు ఒక్కొక్కరికి 10 స్కూలు కేటాయించినట్లు విద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో ఆనంద్ రావు సిఆర్పీలు మహమూద్, యుగంధర్, సురేఖ డైట్ విద్యార్థులు మనీషా, ధనలక్ష్మి, రుచిత పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల అందజేత

బీబీపేట: మండలంలోని తుజాల్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్ఆర్ దేశికా చారి జ్ఞాపకార్థం 111 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేశారు. రానున్న వేసవి సెలవుల నేపథ్యంలో ప్రత్యేక యాక్షన్ ప్లాన్ నిమిత్తం తెలుగు, హిందీ, ఇంగ్లీష్ శిక్షణ కోసం పుస్తకాలు అందజేసినట్లు పీఆర్‌టీయు మండలాధ్యక్షుడు శ్రీనివాస్ చారీ తెలిపారు. ఎంఈవో అశోక్, తదితరులు పాల్గొన్నారు.